అందుబాటులో.. పూల విత్తనాలు

పూల ప్లాంట్‌ను పరిశీలిస్తున్న పూలవిభాగం హెడ్ డాక్టర్ జ్యోతి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 3: నాణ్యత గల పూల మొక్కల నారుమళ్లు అందుబాటులో ఉన్నాయని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ ఆధ్వర్యంలోని రాజేంద్రనగర్ పూల విభాగం హెడ్ డాక్టర్ జ్యోతి తెలిపారు. పూల పరిశోధన స్థానం పరిధిలో దాదాపు 8.5 ఎకరాల్లో నాణ్యత గల సీడ్ బంతి, చామంతి, మల్లె , లిల్లీ, గ్లాడియోలస్, కనకాంబరం, చైనా ఆస్టర్, తదితర నారుమళ్లతో పాటు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అతి తక్కువ ధరలతో పాటు మినీకిట్లు ఇవ్వనున్నామని, పరిశోధనల మొక్కలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తక్కువ మోతాదులో ఎకరాకు పైగా నాటేందుకు ముందుగా సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. నగరం సమీపంలోని రంగారెడ్డి జిల్లాతో పాటు మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ తదితర జిల్లాల రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని డాక్టర్ జ్యోతి తెలిపారు.

మూలన పడ్డ బాడీవార్న్ కెమెరాలు.!

పనిచేస్తున్నట్టా.? లేదా.?
హోంగార్డుల చేతికి ట్యాబ్‌లు
కారులో నుంచి కదలని
కొందరు అధికారులు
ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గాలికి..

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ విభాగంలో పారదర్శకమైన సేవలందించడంలో భాగంగా అందుబాటులోకి తెచ్చిన బాడీవార్న్ కెమెరాలు మూలన పడ్డాయి. నేడు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వీటి వినియోగాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. మరోపక్క ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఠాణాల స్థాయిలోని అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హోంగార్డుల చేతికి ట్యాబ్‌లు ఇచ్చి చలాన్లు కొట్టండంటూ ఆదేశిస్తూ.. హాయిగా కొందరు అధికారులు కారు ఏసీలో నుంచి కాలు కింద పెట్టకుండా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడితే స్థానికంగా ఉండే ఏఎస్సై, కానిస్టేబుల్, హోంగార్డులే చూసుకుంటున్నారు. కొందరు సీనియర్ అధికారులు మాత్రం మనమెందుకు పోవాలే.. అన్నట్టు కారులో నుంచి దిగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. వీఐపీ మూమెంట్స్ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే రోడ్లపై ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు కనిపిస్తున్నారు.

బాడీవార్న్ కెమెరాల మాటే లేదు.!

ఇటీవల జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ పోలీసులకు, ఒక వాహనదారుకు మధ్య గొడవ జరిగింది. వాహనదారుడు పోలీసులతో వాగ్వాదానికి దిగి, తన వాహనాన్ని కిందపడేశాడు. ఇలాంటి ఘటనల సమయంలో పోలీసులు సంయమనం పాటిస్తూ.. ఆవేదనతో ఉండే వాహనదారుడి సమస్యను వినేవాళ్లు కొందరు ఉంటారు. మరికొందరు అవతలి వారికంటే ఎక్కువగా రెచ్చిపోతుంటారు. ఈ సందర్భంలోనే పోలీసులు చేయి చేసుకోవడం వంటి ఘటనలు కూడా జరుగుతుంటాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేలా బాడీవార్న్ కెమెరాలను క్షేత్ర స్థాయిలో ఉండే ట్రాఫిక్ పోలీసులు ధరించాలని కొనుగోలు చేశారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 200 పైగానే కెమెరాలు ఉన్నాయి. ఈ కెమెరాల కొనుగోలు వ్యవహారంలోనూ కొందరు అధికారులు కక్కుర్తిపడ్డట్టు ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి ఈ కెమెరాలను కొన్న పోలీసులు నేడు వాటిని వాడటం లేదు. అయితే, ఈ కెమెరాలు వాడకపోవడంపై భిన్న వాదనాలు వినిపిస్తున్నాయి. కెమెరాలు పనిచేస్తున్నాయా.? మొత్తానికి పాడయ్యాయా.? పనిచేస్తున్నా.. ఆ కెమెరాలను ఎందుకు వాడాలి.. అనే భావనతో మూలన పడేశారా.? అనే అంశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గాలికి.!

ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు ట్యాబ్‌లు పట్టే పరిస్థితి లేదు. అలా అని క్షేత్ర స్థాయిలో ఎస్సైలు పనిచేసినా, ఇన్‌స్పెక్టర్లు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. వారి చేతిలో ఉండే ట్యాబ్‌లు హోంగార్డులు, కానిస్టేబుళ్ల చేతికి ఇవ్వడంతో.. రోజువారీ లక్ష్యంగా 40 నుంచి 50 చలాన్లు కొట్టడం పనిగా పెట్టుకున్నారు. హోంగార్డులు, కానిస్టేబుళ్లతో చలాన్లు కొట్టిస్తుండటంతో ఆయా కూడళ్లలో ట్రాఫిక్ క్రబద్ధీకరించే ట్రాఫిక్ సిబ్బంది తక్కువ ఉండటం, కొన్ని చోట్ల అసలు ఉండటం లేదు. కనీసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు ట్రాఫిక్ రద్దీ ఏర్పడే కూడళ్లలో కొద్దిసేపు ఉన్నా.. ట్రాఫిక్ ఇబ్బందులు కొంతైనా తగ్గే అవకాశం ఉంటుంది. అయితే, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పోలీస్ ఉన్నతాధికారులు రోజూ రాకపోకలు సాగించే మార్గల్లో మాత్రం ఇన్‌స్పెక్టర్లు కనిపిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. మిగతా రూట్లలో చాలా వరకు ఇన్‌స్పెక్టర్లు రోడ్డుపైకి రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లు నిషేధించలేదు: హెచ్‌ఎండీఏ

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ):జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్ల నిషేధంపై హెచ్‌ఎండీఏ స్పందించింది. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అనధికార లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిషేధించినట్లు వస్తున్న కథనాలను ఖండించింది. గత సంవత్సర కాలంగా హెచ్‌ఎండీఏ నుంచి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖకు ఎలాంటి అభ్యర్థన పంపలేదని, గ్రామ పంచాయతీల్లో అనధికార లేఅవుట్ల ప్లాట్‌ల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్వర్తులు జారీ చేయలేదని స్పష్టం చేసింది. ఇలాంటి నిరాధారమైన, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

రైల్వే ప్లాట్‌ఫాంపై నీరు..

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, నవంబర్ 3: రైల్వే ప్లాట్ ఫాంపై నీరు నిల్చింది. ఆ నీటిపై నుంచి నడిచిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్‌కె. షేకీముద్దిన్ (37) మేస్త్రి. జీవనోపాధి కోసం నగరానికి వచ్చాడు. శనివారం అతడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్–1 లో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ ప్లాట్‌ఫాంపై నీరు ఉండటంతో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తలకు బలంగా దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

సైబరాబాద్‌లో 3 రోజుల్లో 513 మంది పట్టివేత

వీరిలో 425 మంది ద్విచక్ర వాహనదారులే..

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా సైబరాబాద్ పోలీసులు మద్యం మత్తులో వాహనాలు నడిపే మందుబాబులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 513 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుపడ్డారు. పట్టుబడిన 513 మందిలో 425 మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. 24 మంది త్రీ వీలర్ డ్రైవర్స్, 60 మంది ఫోర్ వీలర్ డ్రైవర్స్, నలుగురు భారీ వాహనాల డ్రైవర్లు పట్టుపడ్డారు. మొత్తం పట్టుబడిన వారిలో 64 మందికి బీఏసీ 200ఎంజీ/100ఎంఎల్, 550ఎంజీ/100ఎంఎల్‌గా నిర్ధారణ జరిగింది. దీంతో పట్టుబడిన వారందరినీ న్యాయస్థానంలో హాజరుపరిచారు.

నాలెడ్జి సిటీలో బైక్ రేసింగ్.. 35 మందిపై కేసు

శేరిలింగంపల్లి, నవంబర్ 3: నాలెడ్జి సిటీలో బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న 35 మందిపై రాయదుర్గం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం ప్రకారం.. మాదాపూర్ నాలెడ్జి సిటీ టీహబ్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ రహదారులపై ప్రమాదకర స్థాయిలో ద్విచక్ర వాహనాలు వేగంగా నడుపుతూ విన్యాసాలు చేస్తున్నారు. కేకలు వేస్తూ బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న 35 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రమాదకర స్థాయిలో మితిమీరిన వేగంతో బైక్‌లు నడుపుతూ విన్యాసాలు చేస్తున్న వారి ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. బైక్ రేసింగ్‌కు పాల్పడిన వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

వాహనం పడి.. వృద్ధురాలు మృతి

ఘట్‌కేసర్, నవంబర్ 3: ఇంటి ముందు కూర్చున్న వృద్ధురాలిపై ఆక్టివా వాహనం పడి, గాయాలతో మృతి చెందిన ఘటన ఆదివారం ఘట్‌కేసర్ వీకర్‌సెక్షన్ కాలనీలో జరిగింది. ఘట్‌కేసర్ పోలీసుల కథనం ప్రకారం.. కుంభం రాములమ్మ (95) ఇంటి ముందు కూర్చొని ఉండగా.. ఇదే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఖాజా తన ఆటోను నిర్లక్ష్యంగా నడుపుతూ రాములమ్మ ఇంటి ముందు పార్కుచేసి ఉన్న ఆక్టివాను ఢీ కొట్టాడు. దీంతో ఆ ఆక్టివా వాహనం రాములమ్మ మీద పడటంతో గాయాలయ్యాయి. వెంటనే దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి..

మారేడ్‌పల్లి, నవంబర్ 3: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఏపీకి చెందిన పీట్ల వెంకటయ్య (56)కూలీ. స్వగ్రామంలో ఇంటి నిర్మాణానికి, కూతురు వివాహానికి పలువురి వద్ద అప్పులు చేశాడు. వచ్చే సంపాదన చాలకపోవడంతో అప్పులు తీర్చలేదు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్లాట్ ఫారం– 1లోకి వస్తున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోతి దాడిలో వ్యక్తికి గాయాలు

దోమ, నవంబర్ 3: కోతి దాడి చేసి వ్యక్తిని గాయపరిచిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. దోమ గ్రామానికి చెందిన శ్రీశైలం ఇల్లు తెరిచి ఉంచడంతో ఇంట్లోకి దూరిన కోతిని బయటకు వెళ్లగొట్టేందుకు యత్నించారు. రెచ్చిపోయిన కోతి.. శ్రీశైలం పై దాడి చేసి నడుం భాగంలో గోర్లతో గాయపరిచి వెళ్లిపోయింది. కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో ఆహారం కోసం ఇండ్లలో చొరబడి మహిళలను నానా ఇబ్బందులకు గురి చేయడంతో పాటు పంట పొ లాల దగ్గర సైతం పంటలను నాశనం చేస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా కోతులను ఇక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

దర్గాకు వచ్చి.. చెరువులో మునిగి..

నీట మునిగి ఇద్దరు యువకులు మృతి
హైదరాబాద్‌కు చెందినవారిగా గుర్తింపు
మోపాల్ మండలం
మంచిప్ప గ్రామంలో ఘటన

ఖలీల్‌వాడి (మోపాల్), నవంబర్ 3: దర్గాలో ప్రత్యేక ప్రార్థనల కోసం వచ్చిన ఇద్దరు యువకులు చెరువు నీటలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. మోపాల్ ఎస్సై యాదిగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రతి సంవత్సరం మాదిరిగా ఆదివారం మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలోని దర్గా వద్దకు ప్రత్యేక ప్రార్థనల కోసం వచ్చారు. ఇందులో దగ్గరి బంధువులైన సయ్యద్ యాకుబ్ (32), సయ్యద్ వాసిక్ (34) ఇద్దరూ కలిసి సరదాగా స్థానిక పెద్ద చెరువు వద్దకు వెళ్లి స్నానం కోసం నీటిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటం, ఈత రాకపోవడంతో ఇద్దరు నీట మునిగారు. గమనించిన స్థానికులు వెంటనే వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు అక్కడికి వచ్చి గాలించగా.. సయ్యద్ యాకుబ్ మృతదేహం లభ్యమైంది. అనంతరం రిస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా.. సయ్యద్ వాసిక్ మృతదేహం కూడా లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన సయ్యద్ వాసిక్ కరాచీ బేకరీలో అకౌంటెంట్‌గా పనిచేస్తుండగా.. యాకుబ్ ఓ మొబైల్ షాపులో పనిచేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

జంగయ్య (ఫైల్)

నందిగామ, నవంబర్ 3: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ మండలం జంగోని గూడ గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జంగోనిగూడ గ్రామానికి చెందిన జంగ జంగయ్య(42) చేపలు పట్టేందుకు శనివారం సాయంత్రం నర్సప్పగూడ అక్కమ్మ చెరువులోకి వెళ్లి.. చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

మేడ్చల్, నవంబర్ 3: ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఏపీకి చెందిన కోట్ల అవినాశ్ (16) పేట్ బషీరాబాద్‌లోని సెయింట్ ఆంటోని కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అతడి తల్లిదండ్రులు కొంపల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంచారు. సెలవు రోజుల్లో మేడ్చల్ పట్టణంలోని కేఎల్‌ఆర్ కాలనీలో ఉంటున్న తన సోదరి ఇంటికి వచ్చేవాడు. హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో చదవడం తనకు ఇష్టం లేదని, డే స్కాలర్స్‌లో చదువుకుంటానంటూ ఆవినాశ్ తల్లిదండ్రులతో చెప్పాడు. ఇంటర్ పూర్తయ్యే వరకు అక్కడే చదువుకోవాలంటూ తల్లిదండ్రులు సూచించారు. దీంతో మనస్తాపం చెందిన అవినాశ్ దీపావళి సెలవులకు అక్కా బావ ఇంటికి రాగా.. శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వికారాబాద్, నవంబర్ 3: సర్పన్‌పల్లి చెరువులో చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వికారాబాద్ మండల పరిధిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండల పరిధిలోని మద్దులపల్లి తండాకు చెందిన రెడ్యానాయక్ (37) ముగ్గురు స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల సమీపంలో ఉన్న సర్పన్‌పల్లి చెరువుకు వచ్చారు. చేపలు పట్టేందుకు చెరువు తూమ్‌లోకి దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ముగ్గురు స్నేహితులు ఒడ్డుపైకి వచ్చారు. రెడ్యానాయక్ ఆందులో చిక్కుకుపోయి మృతి చెందాడు. పోలీసులను సంప్రదించగా మృతికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని పేర్కొన్నారు.

పోలీసులమంటూ వృద్ధురాలికి బెదిరింపు

- రూ.38 లక్షలు కొట్టేసిన సైబర్ ఛీటర్స్
- కొనసాగుతున్న డిజిటల్ అరెస్ట్‌లు
- ఇటీవలే రూ.3 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకొని.. తాము పోలీసులంటూ బెదిరించిన సైబర్‌నేరగాళ్లు రూ. 38 లక్షలు కాజేశారు. వివరాలిలా ఉన్నాయి.. 74 ఏండ్ల బాధితురాలికి ఫోన్ చేసిన సైబర్‌నేరగాళ్లు.. ముంబైలోని అంధేరి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీపై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది.. మీ ఫోన్ నంబర్‌ను ట్రాయ్ 24 గంటల్లో డిస్‌కనెక్ట్ చేస్తుంది.. అని బెదిరించారు. జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేశ్ గోయెల్‌కు సంబంధించిన మనీలాండరింగ్‌తో మీకు సంబంధం ఉన్నట్లు తేలింది.. అందులో భాగంగానే సీబీఐ, ఈడీ కేసులు దర్యాప్తు చేస్తున్నాయి.. అంటూ భయపెట్టారు. మీ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయాలి.. మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఉంటే ఆర్‌బీఐ ఖాతాలో జమ చేయాలి.. అంటూ ఆమెను ఆందోళనకు గురిచేశారు. మీకు ఈ కేసుతో సంబంధం లేదని తేలితే.. మీరు ఆర్‌బీఐలో జమచేసిన డబ్బు తిరిగి వస్తాయంటూ నమ్మించారు. ఎవరికైనా ఈ విషయం చెబితే మీరు అరెస్ట్ అవుతారని, ఈ కేసులో మీ కుటుంబం మొత్తం ఇరుకుంటుందంటూ హెచ్చరించారు. దీంతో బాధితురాలు భయపడిపోయింది. ఆమె ఫిక్స్‌డ్ డిపాజిట్లను విత్‌డ్రా చేసి రూ. 37.90 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా సైబర్‌నేరగాళ్ల సూచించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసింది. ఆ తర్వాత ఆమెకు అనుమానం రావడంతో కుటుంబసభ్యులతో చర్చించడంతో ఇదంతా మోసమని చెప్పారు. దీంతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రతి రోజు మోసాలు..

ఇలాంటి ఘటనలు ప్రతి రోజు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో జరుగుతూనే ఉన్నాయి. ఇంగ్లిష్, హిందీ మాట్లాడే సీనియర్ సిటిజన్లు, నడి వయస్సు వాళ్లు ఇందులో ఎక్కువగా మోసపోతున్నారు. రెండు రోజుల కిందట ఓ వైద్యురాలిని కూడా ఇదే విధంగా బెదిరించిన సైబర్‌నేరగాళ్లు.. దాదాపు 10 రోజుల పాటు ఆమెను డిజిటల్ అరెస్ట్‌లోనే ఉంచి రూ.3 కోట్లు కొట్టేశారు. ఈ తరహా నేరాలను అరికట్టేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, అలాగే, ఇటీవల మన్‌కీ బాత్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం డిజిటల్ అరెస్టులంటూ ఏమీ ఉండవని, అలాంటి వాటికి భయపడొద్దని ప్రజలకు సూచించారు. ఇలాంటి మోసాలపై మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, నిర్వహిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

మదర్సా నుంచి విద్యార్థుల అదృశ్యం

విద్యార్థులు ఇస్మాయిల్, ఇబ్రహీం

జవహర్‌నగర్, నవంబర్ 3: మదర్సా నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ పరిధిలోని మల్కారంలో ఎండీ యూన్స్.. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. ఆర్మీ దంతవైద్య కళాశాల సమీపంలోని బిలాల్ మసీద్ మదర్సాలో ఇద్దరు కుమారులు గత రెండు నెలలుగా చదువుకుంటున్నారు. శనివారం రాత్రి భోజనం చేసి విద్యార్థులు నిద్రపోయారు. ఆదివారం ఉదయం లేచి చూడగా.. ఇద్దరు సోదరులు ఇస్మాయిల్(12), ఇబ్రహీం(10) కనిపించలేదు. వెంటనే వారి తల్లిదండ్రులకు మదర్సా సిబ్బంది సమాచారమిచ్చారు. విద్యార్థుల ఆచూకీ కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెపక్ తక్రా అసోసియేషన్ నూతన కార్యవర్గం

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పెరిక సురేశ్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం ఫతేమైదాన్‌లో జరిగిన ఎన్నికల్లో 21 మందితో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ సెపక్ తక్రా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ జగన్నాథస్వామి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కొత్త కార్యవర్గం నాలుగేండ్ల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేశ్ కుమార్ మాట్లాడుతూ.. సెపక్ తక్రాను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నూతనంగా ఎన్నికైన తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ కార్యవర్గం

ఆదివారం సాయంత్రం.. హుస్సేన్‌సాగర్ దృశ్యం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ. న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-332542

★KS పెస్ట్ కంట్రోల్ టర్మిట్: 10 సం॥ల గ్యారంటీ, చెదలు, బొద్దింకలు, నల్లులు, బల్లులు, కిచెన్ జెల్ రీజనబుల్ ధరల్లో. 9494914020, 8686101598. NT-335089

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-335088

TRANSLATIONS

★భాలీ దస్తావేజులు, బుక్స్ స్వల్ప వ్యవధిలో అనువదించబడును, సంప్రదించండి: డా॥ మంతెన దామోదర చారి. ఫోన్: 9951868349. NT-532548

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 8074327715. NT-334825

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6/11 కాశీ, 16/11 కామాఖ్య, 25/11 రామేశ్వరం బస్సు, 11/12 కర్ణాటక, 21/2 కాశీ యాత్ర @ 9908844377. NT-336740

PLOT FOR SALE

★గజం: 2,500/- నార్సెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 9666607146. NT-338784

★నాగార్జున సాగర్ హైవే యాచారం టౌన్‌లో గజం. రూ. 8,990/-, DTCP అప్రూవ్డ్ లేఅవుట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్పాట్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 500 గ్రా. సిల్వర్ ఫ్రీ. ఫోన్: 9014297729. NT-339360

★కంపెనీ వార్షికోత్సవం ఆఫర్: ఆలేరుకు అతి సమీపంలో వరంగల్ హైవే కేవలం గుంట: 2,49,999/– మాత్రమే. Ph: 7207166289. NT-339304

★శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బీబీనగర్ టౌన్, AIMSకు అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే॥క॥, ఆల్ డె॥, స్పాట్ రిజి॥, బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9912357546. NT-336726

FLAT FOR SALE

★Kukatpally Prgt Ngr Hi-Rise 36 Floors 2BHK Flats 53L, 3 BHK 69L. ECIL Kapra indp house Gated G+2 120 Sq.yds. RS. 1.75 Cr. Rents 40K. Chegunta Plots Rs. 24L, Narketpally Plot 100 yds. 6L, Janagam Yerragollaphad 605 yds. Farm Land Rs. 4L. Narayankhed Kangti 605 yds. 6L. Cont: 9059163247. NT-332541

WANTED

jobs Apply Now!